క్లుప్తంగా

వాహన తనిఖీలు



చిన్నశిర్లాం వద్ద వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నీలావతి

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం, బూరాడ జంక్షన్‌ల వద్ద ఎస్‌ఐ పి.నీలావతి పోలీస్ సిబ్బందితో కలిసి సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు.వాహన చోదకుల లైసెన్స్‌లు, వాహనాల పత్రాలను పరిశీ లించారు. హెల్మెట్ ధరించని ద్విచక్రవాహన చోదకులకు అపరాధ రుసుం విధించారు. ఈసందర్భంగా వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్‌ఐ అవగాహన కల్పించారు.

తోటపల్లి కాలువలో తుప్పల తొలగింపు

రేగిడి: మండలంలోని బూరాడ, చిన్నశిర్లాం, కొర్లవలస తదితర గ్రామాల పంట పొలాలకు సాగునీరందించే తోటపల్లి పిల్ల కాలువలో ఉపాధి పనుల్లో భాగంగా వేతనదారులు సోమవారం తుప్పలు, పూడిక తొలగింపు పనులు చేపట్టారు.ఈ పనులను ఉపాధి హామీ పథకం ఏపీఓ ఎస్.హరనాథరావు పర్యవేక్షించారు. ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరమణ, మేట్‌లకు ఏపీఓ పలు సూచనలు చేశారు.

ఘనంగా సత్యసాయి విగ్రహ ప్రతిష్ఠ



సత్యసాయి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

రాజాం: పట్టణంలోని కంచరాం వీధిలో ఉన్న సత్యసాయి మందిరంలో సత్యసాయిబాబా పాలరాతి విగ్రహ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. మందిర నిర్వాహకులు, సత్యసాయి భక్తులు విశేష పూజలు, హోమాలు, చేశారు.రాజాం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, ఆధ్యాత్మిక వక్తలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

వంగర: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి అన్నారు. మండలంలోని కొప్పరవలస సచివాలయంలో సోమవారం ఆయన తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం, ఆధార్ నమోదు, మిత్ర వాట్సాప్ సేవలపై సమీక్షించారు. సచివాలయంలోని ఆధార్ సెంటర్‌లో అందిస్తున్న సేవలను పరిశీలించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు.

ఫిర్యాదు

సంతకవిటి: మామిడిపల్లి రెవెన్యూ పరిధిలోని పైలవాని చెరువు సప్టా నుంచి నీరు పారే బట్టి, పక్కనే ఉన్న దారిని వాకముళ్ల సూర్యనారాయణ, వాకముళ్ల చిన్నారావు అనే వ్యక్తులు దౌర్జన్యంగా కప్పివేశారని మొదుగులపేట రైతులు తహసీల్దార్ బి.సత్యంకు సోమవారం ఫిర్యాదు చేశారు. బట్టిని కప్పివేయడంతో చెరువులోని మిగులు జలాలు బయటకు వెళ్లడానికి అవకాశం ఉండదని ఫిర్యాదులో పేర్కొన్నారు.బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

సారా రహిత మండలంగా బొబ్బిలి



బొబ్బిలిని సారా రహిత మండలంగా ప్రకటిస్తున్న అధికారులు

బొబ్బిలిరూరల్: బొబ్బిలిని సారా రహిత గ్రీన్ మండలంగా అధికారులు ప్రకటించా రు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు, ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు సోమవారం సమావేశమయ్యారు.ఈసందర్భంగా ఎక్సైజ్ సీఐ చిన్నం నాయుడు మాట్లాడుతూ గతంలో మండలంలోని కొయ్యికొండవలస గిరిజన గ్రామంలో సారా తయారీ,విక్రయాలు జరిగేవని, ఆగ్రామాన్ని బీ కేటగిరిలో ఉంచి నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. సారాతో కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించామని, గత మూడునెలలుగా అక్కడ సారాను పూర్తి స్థాయిలో కట్టడి చేయగలిగామని వివరించారు. దీంతో అధికారులంతా మండలాన్ని సారా రహిత గ్రీన్ మండలంగా తీర్మానించారు. తహసీల్దార్ మల్లెపురెడ్డి శ్రీను, ఎంపీడీఓ పి.రవికుమార్, బొబ్బిలి సీఐ సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: పట్టణ పరిధి వస్త్రపురికాలనీ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే కాలనీకి చెందిన రెడ్డి దాలినాయుడు గాయాలపాలయ్యాడు. ఇందుకు సంబంధించి ఎస్సై వై.రవికిరణ్ తెలిపిన వివరాల మేరకు దాలినాయుడు ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో కంచరాం నుంచి ఎదురుగా ద్విచక్రవాహనంపై వచ్చిన వ్యక్తి ఢీకొనడంతో దాలినాయుడు తల, కాలికి గాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కానరాని కార్పొరేషన్ రుణాలు..!

- బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాల కోసం అట్టహాసంగా దరఖాస్తులు స్వీకరించిన అధికారులు
- హడావిడిగా ఇంటర్వ్యూలు
- పలుచోట్ల ముడుపులు వసూళ్లు
- నెలరోజులు గడిచినా మంజూరు కాని రుణాలు



రాజాం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

రాజాం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి అన్నింటా ప్రచార ఆర్భాటమే తప్ప ఆచరణలో మాత్రం శూన్యం. సూపర్ సిక్స్ పథకాలను అటకెక్కించిన ప్రభుత్వం తాజాగా ప్రకటించిన బీసీల స్వయం ఉపాధి రాయితీ రుణాలను సైతం మరచి పోయింది. దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి నెల రోజులు గడిచినా నేటికీ అర్హుల జాబితా సిద్ధం కాలేదు. ఇందుకు స్థానికంగా ఉన్న అధికార పార్టీ నాయకుల సిఫార్సులే కారణమని తెలుస్తోంది. ఆశ చూపి అటకెక్కిస్తారా అంటూ దరఖాస్తుదారులు లబోదిబోమంటున్నారు. ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి నిమిత్తం రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటే ఇంతవరకూ ఒక్కరికి కూడా రుణం ఇవ్వకపోవడంపై మండిపడుతున్నారు.

రాజాం నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు..

మండలం	దరఖాస్తుదారులు
రాజాం	420
రేగిడి	540
సంతకవిటి	330
వంగర	360
రాజాం మున్సిపాలిటీ	480

ఎదురుచూపులే మిగిలాయి..

వెనుకబడిన తరగతుల్లో నిరుద్యోగ యువతీ,యువకులకు స్వయం ఉపాధి కల్పన నిమిత్తం ప్రభుత్వం రాయితీ రుణాలు ప్రకటించింది. రాజాం నియోజకవర్గంలోని రాజాం మున్సిపాలిటీతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో బీసీ రుణాలకు 2,130 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అలాగే వీరంతా ఆయా మండల, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అయితే ఇంత వరకూ వీరిలో ఒక్కరికి కూడా ఈ రుణం విడుదలకాలేదు. ఈ రుణాల కోసం దరఖాస్తు నుంచి ఇంటర్వ్యూల వరకు ఒక్కొక్కరూ రూ. 500 వరకు ఖర్చు చేశారు. పలువురు అధికార పార్టీ నేతల ఇళ్లు, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఇంకొంతమంది రూ.లక్ష రుణానికి రూ.5 వేలు చొప్పున అధికార పార్టీ కార్యకర్తలకు ముడుపులు చెల్లించిన సందర్భాలు ఉన్నాయి. వీరందరికీ ప్రభుత్వం పంగనామాలు పెట్టేలా కనిపిస్తోంది. ఇంతవరకూ ఏ ఒక్కరికి రుణం ఇవ్వలేదు. ఈ రుణాల నిమిత్తం బ్యాంకులు చుట్టూ తిరిగి ఆయా బ్యాంకు మేనేజర్ల ద్వారా విల్లింగ్ పత్రాలు తీసుకొచ్చినవారు కూడా నిరాశతో కనిపిస్తున్నారు.

అంతా ఇంత కాదు..

బీసీ రాయితీ రుణాలు మంజూరు చేస్తామంటూ కొంతమంది అధికారులు చేసిన హడావిడి మామూలుగా లేదు. రాజాం మున్సిపాలిటీ, వంగర, సంతకవిటి మండలాల్లో అధికారులు పెద్ద ఎత్తున ఈ రుణాలకు ఇంటర్వ్యూల పేరుతో ప్రభుత్వ కొలువులు ఇచ్చే మాదిరిగా హడావుడి చేశారు. దరఖాస్తుదారులే ఇంటర్వ్యూలకు రావాలని, అన్ని సర్టిఫికెట్లు ఒరిజినల్ తీసుకురావాలని, బ్యాంకు విల్లింగ్‌లు ఉండాలని ఆదేశాలు జారీచేశారు. సంతకవిటి మండలంలో మండల పరిషత్ అధికారులు నేరుగా టీడీపీ నేతల విల్లింగ్ తీసుకోరావాలని కొంతమందికి సూచించారన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. మరికొంత మంది అధికారులతో బేరసారాలు పెట్టుకున్నారు. ఇంతచేసినా చివరకు రుణాలు ఇవ్వలేకపో యారు. దీంతో అధికారపార్టీ నాయకులతో పాటు అధికారులపై దరఖాస్తుదారులు మండిపడుతున్నారు.

ఇంతవరకు సమాచారమే లేదు..

బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో రూ. 2 లక్షల రుణానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాను. ఇంటర్వ్యూకు రాజాం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాను. ఇంత వరకు రుణం మంజూరు కాలేదు. నేను అర్హుడునో కాదో కూడా చెప్పలేదు.

– జి. రవికుమార్, రాజాం.

ఇంటర్వ్యూలే మిగిలాయి

బీసీ కార్పొరేషన్ రుణాల నిమిత్తం ఇంటర్వ్యూలే మిగిలాయి. ఇంతవరకు ఎటువంటి రుణాలు ఇవ్వలేదు. సంతకవిటి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూకు వెళ్లాను. టీడీపీ కార్యకర్తల విల్లింగ్ ఉండాలన్నారు. అవి కూడా చేశాం. ఇంత వరకు రుణం రాలేదు.

– ఆర్. అప్పలనాయుడు, సంతకవిటి

ఇంటర్వ్యూలు వరకే మా బాధ్యత



బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు వరకే మా బాధ్యత. రుణాల మంజూరీ కార్పొరేషన్‌తో పాటు బ్యాంకర్ల పరిధిలో ఉంటుంది. మాకు ఎటువంటి సంబంధం ఉండదు.

– జె.రామప్పలనాయుడు, కమిషనర్, రాజాం మున్సిపాలిటీ

స్పెషల్ గ్రేడ్ పంచాయతీగా రామభద్రపురం



రామభద్రపురం గ్రామం

రామభద్రపురం: ప్రభుత్వం పది వేలపైగా జనాభా లేదా రూ.కోటికి పైగా వార్షిక ఆదాయం ఉన్న గ్రామ పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా పునర్‌వర్గీకరిస్తోంది. అందులో భాగంగానే మండల కేంద్రమైన రామభద్రపురం మేజర్ పంచాయతీని స్పెషల్ గ్రేడ్ పంచాయతీగా గుర్తించినట్లు డిప్యూటీ ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం తెలిపారు. అలాగే ఈ పంచాయతీకి డిప్యూటీ ఎంపీడీఓను పర్యవేక్షణ అధికారిగా నియమించేందుకు సర్కారు నిర్ణయం తీసుకుంద న్నారు.అలాగే మండలంలోని మిగిలిన 21 పంచాయతీల్లో నాలుగు వేలు నుంచి పదివేల లోపు జనాభా ఉండి ఇప్పటి వరకు గ్రేడ్–4లో ఉన్న ఆరికతోట,కొట్టక్కి పంచాయతీలను గ్రేడ్–1, రెండు వేల నుంచి నాలుగు వేల లోపు జనాభా ఉన్న కొండకెంగువ, కోటశిర్లాం, తారాపురం, నాయుడువలస,రొంపల్లి పంచాయతీలను గ్రేడ్–2 పంచాయతీలుగా చేయనున్నట్లు చెప్పారు. రెండు వేల లోపు జనాభా ఉన్న బూసాయవలస, మిర్తివలస,రావివలస,సోంపురం, గొల్లపేట, ముచ్చర్లవలస, ఇట్లామామిడిపల్లి, పాతరేగ, జన్నివలస, ఎస్.సీతారాం పురం, మామిడివలస, కొత్తరేగ, దుప్పలపూడి, నరసాపురం పంచాయతీలు గ్రేడ్–3 పంచాయతీలుగా చేయనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా రామాలయ వార్షికోత్సవం



వంగర: రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రాజాం సిటీ: అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేష్

వంగర: మండలంలోని బాగెంపేటలో రామాలయ తృతీయ వార్షికోత్సవాన్ని గ్రామస్తు లు సోమవారం వైభవంగా నిర్వ హించారు. ఆలయ అర్చకులు వేణుశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సీతారాముల కల్యాణం అనంతరం ఊరే గింపు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

ముగిసిన ఉత్సవాలు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి కొండంపేటలో మూడురోజుల పాటు నిర్వహించిన అయ్యప్పస్వామి దేవాలయ వార్షికోత్సవంతో పాటు శివాలయం ప్రతిష్ఠోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆలయ ధర్మకర్త ముద్దన సత్యారావు, భక్తులతో అర్చకులు అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. అయ్యప్ప ఆలయ ప్రాంగణంలోనే నిర్మించిన శివాలయంలో కాశీ నుంచి తీసుకువచ్చిన శివలింగాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం సుమారు నాలుగు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ముగింపు ఉత్సవాలకు వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, సలాది సతీష్, ఆశపు సూర్యం, వెంపల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నాగబంధం ప్రతిష్ఠ..

బొబ్బిలి: స్థానిక తారక రామా కాలనీలోని కోదండ రామాలయంలో సోమవారం నాగబంధం ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి మరో అవతారంగా చెప్పుకునే నాగబంధాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

రేగిడి: మండలంలోని బూరాడ, లింగాలవలస, తోకలవలస తదితర గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో కౌలు రైతులకు అందించే పంట సాగు దారు హక్కు పత్రాల(సీసీఆర్‌సీ)పై వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజాం వ్యవసాయశాఖ ఏడీఏ కె.చంద్రరావు మాట్లాడుతూ కౌలుకు భూములు ఇచ్చే రైతులు తమ భూహక్కుపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. కౌలు రైతులకు ఇచ్చే హక్కు పత్రాలు తాత్కాలికమేనని, వీటిపై కొంతమంది రైతులకు అనుమానాలు ఉన్నాయని, ఎటువంటి అపోహలు వద్దని పేర్కొన్నారు. కౌలుకు భూములు సాగు చేసే చేస్తున్న రైతులకు ప్రభుత్వం రాయితీపై ఎరువులు, పురుగుమందులు ఇస్తోందని వివరించారు. ఏఓ జి.మురళీకృష్ణ, వీఏఏలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీసెట్

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం, సాయంత్రం రెండు సెషన్‌లుగా నిర్వహించిన ఈ పరీక్షలకు మొత్తం 562 మంది హాజరుకావాల్సి ఉండగా 524 మంది హాజరయ్యారని పరీక్షల నిర్వాహకులు తెలిపారు.

భూసమస్యలు పరిష్కరించాలని వినతి

తెర్లాం: తమ భూసమస్యలను పరిష్కరించాలని మండలంలోని డి.గదబవలస ఎస్సీ కాలనీ రైతులు తహసీల్దార్ హేమంత్‌కుమార్‌ను కోరారు. తహసీల్దార్ కార్యాల యంలో సోమవారం నిర్వహించిన ప్రజా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం గతంలో డీపట్టా భూములు పంపిణీ చేసిందని, భూ రీసర్వే తర్వాత తమ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకం ద్వారా సాగు పెట్టుబడి సాయం అందుతుందో లేదో తెలియడం లేదని తహసీల్దార్ ఎదుట వాపోయారు. స్పందించిన తహసీల్దార్ వెంటనే గ్రామ సర్వేయర్‌ను పిలిపించి సమస్యను పరిష్కరించాలనిఆదేశించారు.

నీటితీరువా వసూళ్లను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

తెర్లాం: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ వీఆర్‌ఓలకు సూచించారు.స్థానిక తహసీల్దార్ కార్యాల యం లో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు.పంచాయతీల వారీగా నీటి తీరువా వసూళ్లపై వీఆర్‌ఓలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.28 లక్షలు నీటితీరువా బకాయి ఉందన్నారు. ప్రస్తుతం 1,434 ఫసలీకి సంబంధించిన నీటి తీరువాను వసూలు చేస్తున్నట్లు చెప్పారు. నీటి తీరువా పన్నును శతశాతం వసూలు చేయడంపై వీఆర్‌ఓలు దృష్టి సారించాలని, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని అన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న అధికారి ప్రియాంక నాషిన్

రాజాం సిటీ: స్థానిక డోలపేట జంక్షన్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఐసీఏఎస్, డిప్యూటీ సెంట్రల్ జనరల్ ఫైనాన్స్, మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి ప్రియాంక నాషిన్ సోమవారం ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సంద ర్భంగా తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సైనికులు, సైనిక ఉద్యోగులు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, తూర్పు కాపు సంఘం సభ్యులు పాలవలస శ్రీనివాసరావు, ఆర్.వి.జె.నాయుడు, శాసపు వేణుగోపాలనాయుడు, పెంకి చైతన్యకుమార్, పాట్నూరు లక్ష్మణరావు, సోమశేఖర్, వాసు, లక్ష్మ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



మ్యూజికల్ ఛైర్ గేమ్ ఆడుతున్న విద్యార్థులు

తెర్లాం: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధృడత్వానికి దోహదపడతాయని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం మ్యూజికల్ ఛైర్ గేమ్, ఖోఖో, కబడ్డీ, క్యారమ్స్, చెస్ ఆటలు ఆడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లోనూ రాణించాలన్నారు.



అధ్వానంగా పార్కు

పారిశ్రామికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందుతున్న రాజాం పట్టణంలో ఆహ్లాదం ఎండమావి మారింది. వైఎస్సార్‌సీపీ అధి కారంలోకి వచ్చిన తర్వాత పట్టణం మధ్యలో బొబ్బిలి సెంటర్‌లోని ఎర్రవాని చెరువును పార్కుగా మార్చేందుకు ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ద్వారా రూ.1.03 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో చెరువును అందమైన పార్కుగా మలిచారు. లోపల ఫుట్ పాత్ నిర్మాణంతో పాటు ఇరు వైపులా మొక్కలు నాటారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్కు నిర్వహణను పూర్తిగా విస్మరించారు. ఫలితంగా ఎర్రవాని చెరువు ఇప్పుడు కలుపుమొక్కలతో అధ్వానంగా మారింది. ఒకప్పుడు జనాలతో కళకళలాడే ఈ పార్కు వైపు ప్రస్తుతం ఒక్కరు కూడా వెళ్లడం లేదు.

– రాజాం





బూసాయవలస, రామభద్రపురంలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టెలు

బిల్లుల కోసమా.. పశువుల కోసమా..?

వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మిస్తున్నామని కూటమి ప్రభుత్వం విపరీతమైప ప్రచారం చేసుకుంది. రామభద్రపురం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో పది నీటితొట్టెలు నిర్మించారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.33 వేలు వెచ్చించారు. నిర్మాణాలు పూర్తయ్యి నెల రోజులు కావొస్తున్నా ఇంకా ఎక్కడా ఇవి వినియోగంలోకి రాలేదు.వీటి నిర్వహణ బాధ్యతను పంచాయతీ సిబ్బంది గాలికొది లేయడంతో లక్ష్యం నీరుగారుతోంది. పశువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. ఈ నిర్మాణాలు కూటమి నాయకుల జేబులు నింపేందుకే చేశారు తప్ప పశువుల కోసం కాదన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. నీటి తొట్టెలను పశువుల దాహార్తి తీర్చడానికి నిర్మించారా లేక కూటమి నాయకుల ధన దాహం తీర్చడానికా అని పాడి రైతులు, మూగజీవాల పెంపకందారులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటితొట్టెల్లో నీరు నింపేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

– రామభద్రపురం



పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా చాలా వరకు వ్యాధులు దరి చేరవని, ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ పి. రవికుమార్ అన్నారు. బొబ్బిలి మండలంలోని జగన్నాథపురం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై సోమవారం అవగాహన కల్పించారు. చెత్తను ఆరు బయట, వీధుల్లో ఎక్కడపడితే అక్కడ పారబోయవద్దని 'స్వచ్ఛభారత్– స్వచ్ఛ జగన్నాథపురం' కార్యక్రమంలో భాగంగా గ్రామ శివారులో కొత్తగా నిర్మించిన కుండీలో వేయాలని గ్రామస్తులకు సూచించారు. సర్పంచ్ బొద్దల పద్మ తదితరులు పాల్గొన్నారు.

– బొబ్బిలిరూరల్

ఆదర్శప్రాయుడు సుందరయ్య



రాజాం సిటీ: గార్రాజు చీపురుపల్లిలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామ్మూర్తినాయుడు, తదితరులు



బొబ్బిలిరూరల్: సియోనువలస గిరిజనులకు చీరలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ, యూటీఎఫ్ నాయకులు

రాజాం సిటీ: స్వాతంత్ర్య సమరయోధుడు, దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని కార్మిక సంఘం నేత సీహెచ్.రామ్మూర్తినాయుడు అన్నారు. మండలంలోని గార్రాజు చీపురుపల్లిలో సుందరయ్య వర్ధంతిని సోమవారం నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడిత ప్రజల పక్షపాతి సుందరయ్య అని కొనియాడారు. ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన సుందరయ్య ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రామస్తులు శ్రీనివాసరావు, రామయ్య, రాంబాబు, తేజ, మరిబాబు, కృష్ణ, రామలక్ష్మి, చిన్నమ్మడు, గోపి పాల్గొన్నారు.

పీడిత ప్రజల కోసం పోరాడిన మహనీయుడు

బొబ్బిలిరూరల్: నిరుపేదల జీవితాలను మార్చేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీఐటీయూ, యూటీఎఫ్ సంఘాల నాయకులు కొనియాడారు. సుందరయ్య వర్ధంతిని మండలంలోని గిరిజన గ్రామం సియోనువలసలో సోమవారం నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.సీఐటీయూ జిల్లా నాయకుడు పి.శంకరరావు, యూటీఎఫ్ నాయకురాలు విజయగౌరి మాట్లాడుతూ పీడిత ప్రజలు,గిరిజనుల కోసం ప్రజా సంఘాలను ఏకం చేసి చైతన్య పరిచిన వ్యక్తిగా సుందరయ్య చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. ధనిక కుటుంబంలో పుట్టినప్పటికీ తెలంగాణా సాయుధపోరాటంలో కీలక పాత్ర పోషించారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త చింతల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపన కోసం పనిచేశారు..

బొబ్బిలి: ప్రస్తుత రాజకీయ వ్యవస్థ కులమతాలు, అవినీతితోనే నడుస్తున్నాయని పట్టణ సీపీఎం కన్వీనర్ పొట్నూరు శంకరరావు అన్నారు.స్థానిక 30, 7వ వార్డుల్లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి సీపీఎం జెండాను ఎగురవేశారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు భిన్నంగా సుందరయ్య వ్యవహరించేవారన్నారు. జమిందారు కుటుంబంలో జన్మించినప్పటికీ హుందాతో కూడిన రాజకీయాలు చేశారన్నారు. శ్రామిక వర్గం కోసం సమసమాజ స్థాపన కోసమే ఆయన పనిచేసేవారని, కొన్ని సంఘటనలు తెలియజేశారు. జి గౌరీష్, రమణమ్మ, మంగళ గిరిప్రసాదు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.